క్లుప్తంగా

సమాజాభివృద్ధిలో గ్రంథాలయాలది కీలక పాత్ర

విజయనగరం అర్బన్: సమాజాభివృద్ధిలో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషిస్తాయని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు రెడ్డి పద్మావతి అన్నారు. స్థానిక గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె పుస్తక పఠనాన్ని అలవర్చుకున్న మానవ సమాజంతో అన్ని రంగాల అభివృద్ధి సాధ్యమని అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం సుమారు 45 వేల పుస్తకాలతో జిల్లాలోనే అతిపెద్ద లైబ్రరీగా అలరారుతోందన్నారు. ప్రతి ఏడు ఇచ్చే జయంతి రామలక్ష్మణ మూర్తి స్మారక పురస్కారాన్ని బాడంగి శాఖాగ్రంథాలయ అధికారి దుర్గాప్రసాద్‌కు ప్రకటించి బహూకరించారు. కార్యక్రమంలో సంస్థ మాజీ అధ్యక్షుడు రొంగలి పోతన్న గ్రంథాలయ శాఖ కార్యదర్శి బి.లక్ష్మి, ఎ.గోపాలరావు, విద్యార్థులు, గ్రంథాలయ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గోపాష్టమి వేడుకలు

విజయనగరం: జిల్లా కేంద్రంలోని కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ ప్రాంతంలో గల గోశాలలో గోపాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర ముఖ్య అతిథిగా హాజరై భక్తులతో కలసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సనాతన సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా నగరంలో గోపాష్టమి వేడుకలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో తోట వాసు, జాకీర్ హుస్సేన్, రామకృష్ణ, శ్రీనివాస్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

డెంకాడ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పలు రకాల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డెంకాడ పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం సోమవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పతివాడ గౌరి, లైబ్రేరియన్ మహేష్, దేముడు, రొంగలి గోపాలకృష్ణ, కేవీ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు నెల్లిమర్ల క్రీడాకారులు

నెల్లిమర్ల: దక్షిణ భారత అంతర్ విశ్వ విద్యాలయాల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు నెల్లిమర్ల క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ మేరకు రిటైర్డ్ పీడీ బొమ్మన రామారావు సోమవారం మాట్లాడుతూ, నగర పంచాయతీకి చెందిన తాడ్డి లావణ్య, సోమాదుల భాను, తామాడ భవానీ, గుర్రాల భువన కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని, వీరు ఈ నెల 22 నుంచి 25 వరకు తమిళనాడులోని అలగప్ప యూనివర్సిటీలో నిర్వహించనున్న పోటీల్లో ఏయూ తరపున ప్రాతినిథ్యం వహిస్తారని చెప్పారు. క్రీడాకారులను కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు బోని సూర్యనారాయణ, పెద్దలు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి

విజయనగరం రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరువ కావాలన్నా, గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు త్వరతగతిన పూర్తి కావాలన్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్నకు చెబుదాం, మండలంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అరుణకుమారి, ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయం విద్యార్థి, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడు ఆదినారాయణను వర్సిటీ ప్రతినిధులు సోమవారం అభినందించారు. యూనివర్సిటీలో బీబీఏ చదువుతున్న ఆదినారాయణ ఇటీవల శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు హాజరై బంగారు పతకం సాధించాడు. దీంతో ఆయన్ను వర్సిటీ ప్రతినిధులు ప్రశాంత్‌కుమార్ మహంతి, డాక్టర్ పల్లవి, ఆర్ఎస్ వర్మ, కోచ్ అర్జున్, నారాయణ అభినందించారు.

సెంచూరియన్‌లో 'న్యూరోసైన్స్'పై సదస్సు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలిలో గల సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో 'న్యూరో సైన్స్ అండ్ కాగ్నిటివ్ అప్రోచెస్' అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ, న్యూరోసైన్స్‌కు రోజురోజుకీ ప్రాధాన్యం పెరుగుతోందని, ఇటువంటి సదస్సులు యువతకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కనాల సుధేష్ణ, డీన్ ఆచార్యులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

విజయనగరం: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి చిన్న శ్రీను సోల్జర్స్ చేయూతనందించారు. హుకుంపేట నూతి సెంటర్ వద్ద నివాసం ఉంటున్న షేక్ సర్దార్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న చిన్న శ్రీను సోల్జర్స్ ప్రతినిధులు బాధితుడికి సోమవారం నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో జాకీర్ హుస్సేన్, రామకృష్ణ, శ్రీనివాస్, మజ్జి ప్రసాద్, దుంప గణేష్, జగన్, చిరంజీవి, అశోక్, శివ, తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ...



నెల్లిమర్ల రూరల్: ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న ఉమా సదాశివస్వామి



విజయనగరం టౌన్: రింగురోడ్డు సింహాద్రినగర్‌లో గల షిర్డీ సాయిబాబా ఆలయంలో కొలువైన శివలింగానికి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్న భక్తులు

కార్తీకమాస మొదటి సోమవారం సందర్భంగా ఆలయాల్లో శివనామ స్మరణ మార్మోగింది. వాడవాడలా ఉన్న శివాలయాలకు వేకువజాము నుంచే భక్తుల తాకిడి ఎక్కువైంది. ఈ సందర్భంగా భక్తుల గోత్రనామాలతో అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా.. ఆలయ ఆవరణల్లో ఉన్న ధ్వజస్తంభాలు, తులసి మొక్కల వద్ద మహిళా భక్తులు దీపారాధన చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



పూసపాటిరేగ: కుమిలి శివాలయంలో క్యూలైన్‌లో భక్తులు



డెంకాడ: బెటాలియన్ వద్ద ఉన్న శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



విజయనగరం టౌన్: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వేప,రావిచెట్ల వద్ద దీపాలు వెలిగిన మహిళా భక్తులు

సాగుకు ఇబ్బంది కలిగించవద్దు..

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్



స్పందనలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన కొత్త వెలగాడ బాధితులతో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జైహింద్‌కుమార్

విజయనగరం ఫోర్ట్: గంట్యాడ మండలం కొత్తవెలగాడ గ్రామానికి చెందిన దళిత కుటుంబాలు సాగు చేసుకోవడానికి ఎటువంటి ఇబ్బంల్లేకుండా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కొత్త వెలగాడ గ్రామంలో 60 మంది ఎస్సీ కుటుంబాలకు ప్రభుత్వం 1976లో ఒక్కో కుటుంబానికి రెండున్నర ఎకరాలు చొప్పున 150 ఎకరాల డీ పట్టా భూమిని కేటాయించి, పట్టాలు కూడా మంజూరు చేసిందని చెప్పారు. అప్పటి నుంచి సుమారు 45 సంవత్సరాలుగా సదరు భూమిలో జీడి, మామిడి మొక్కలు సాగు చేసుకుంటూ వస్తున్నారన్నారు. ఆ భూములకు సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకాలు, టైటిల్ డీడ్‌లు కూడా రైతులకు ఇచ్చారని తెలిపారు. అయితే ప్రస్తుతం అటవీశాఖ అధికారులు ఆ భూముల్లో సాగు చేపట్టకుండా ఇబ్బంది కలిగిస్తున్నారని, ఈ విషయమై స్పందనలో ఫిర్యాదు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎల్. దాలిబాబు, ద్వారపూడి అప్పలనాయుడు, తాటిపూడి చినదాలయ్య, పి. సూర్యనారాయణ, కోరాడ నారాయణ, బి. కన్నయ్య, ఆర్. పెద పైడియ్య, తదితరులు పాల్గొన్నారు.

స్పందించకపోతే సమ్మె తప్పదు..

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ



మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

విజయనగరం పూల్‌బాగ్: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని వాగ్దానం చేయడమే కాకుండా, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెంటనే ఆ హామీలను అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె. సుబ్బరావమ్మ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన దీక్షను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కార్మికులను పర్మినెంట్ చేసి న్యాయం చేయాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ - ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) విజయనగరం జిల్లా బాధ్యుడు ఎ. జగన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్, పట్టణ పౌర సంక్షేమ సంఘ జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, రైతు సంఘ జిల్లా కార్యదర్శి బి. రాంబాబు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టీవీ రమణ, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి ఎ. శ్రీనివాస్, యూఎస్ రవికుమార్ మద్దతు తెలియజేశారు. నిరసన దీక్షలో గౌరీ, భాస్కరరావు, ఆదినారాయణ, బాబూరావు, చంద్రావు, లక్ష్మి, దుర్గారావు, పైడిరాజు, రాఘవ, వంశీ, శ్రీను, రామారావు, రజిని, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వీటీ అగ్రహారం విద్యార్థులు



రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ పోటీలకు నగరంలోని వీటీ అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-14, 17 విభాగాల్లో బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాంశంలో టి.లాస్య, విక్రమ్, రాహుల్ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తెలిపారు. అదేవిధంగా సెపక్‌తక్రా పోటీలకు ఎస్. సుజాత, పి.లహరి, పి.పూజిత, హేమంత్, ప్రవీణ్, శేఖర్, సాయిదేవహర్ష, సాయి వినయ్, శివకుమార్, వీఎస్ వరుణ్‌కుమార్ ఎంపికయ్యారన్నారు. సాఫ్ట్ టెన్నిస్ క్రీడాంశంలో పి.సాగర్, ఎం.పవన్ కల్యాణ్, ముఖేష్, ఎస్. నవీన్... నెట్‌బాల్ క్రీడాంశానికి సంబంధించి ఐ.తేజశ్విని, ఎం.ముఖేష్ ఎంపికయ్యారని తెలిపారు. అనంతరం క్రీడాకారులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ధర్మారావును ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- నగరంలోని వివిధ డివిజన్‌లలో రూ.46 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం



6వ డివిజన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్, తదితరులు

విజయనగరం: కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో రూ. 46 లక్షలతో నిర్మించనున్న రహదారులు, కాలువల నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 6వ డివిజన్‌లోని సీఆర్‌నగర్‌లో 18 లక్షల రూపాయలతో.. జొన్నగుడ్డి ప్రాంతంలో 4.50 లక్షలతో.. పద్మావతినగర్ రెండో లైన్‌లో 18 లక్షల రూపాయలతో.. 33వ డివిజన్ ఐనాక్స్ ప్రాంతంలో 5.50 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, రానున్న రోజుల్లో విజయనగరాన్ని సమస్యల్లేని పట్టణంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తూ, వాటిని ప్రారంభిస్తున్నారని చెప్పారు. పేద ప్రజల ఆకలి బాధలను తీర్చేందుకు ఆరు చోట్ల ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రూ.46 లక్షల గడప గడపకు.. నిధులతో నగరంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. డిప్యూటీ మేయర్ లయాయాదవ్, స్థానిక కార్పొరేటర్లు ఆల్తి సత్యకుమారి, ఎన్ని లక్ష్మణరావు, ఎవర్ణ విజయలక్ష్మి, జీవీ రంగారావు మాట్లాడుతూ, తమ డివిజన్లలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపనలు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటికే తమ డివిజన్ల పరిధిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, జోనల్ ఇన్‌చార్జ్‌లు బొద్దాన అప్పారావు, మారం బాల బ్రహ్మారెడ్డి, ఆల్తి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం..

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



పూసపాటిరేగ: పేరాపురంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు అప్పలనాయుడు, శ్రీనివాసరావు, తదితరులు



విజయనగరం రూరల్: జొన్నవలసలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీప అప్పలనాయుడు

డెంకాడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని మోపాడలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా వైఎస్సార్‌సీపీ జెండాతో పాటు మోపాడ గ్రామ సచివాలయం పరిధిలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాల ఖర్చు వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఎమ్మెల్యే అప్పలనాయుడు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా ఆదుకుంటోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, డి.తాళ్లవలస సర్పంచ్ త్రిమూర్తులు, మోపాడ, కొండరాజుపేట మాజీ సర్పంచ్‌లు బడ్డుకొండ రమేష్, సరగడ బంగారురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనే సీఎం కావాలి..

పూసపాటిరేగ: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్నందున మళ్లీ ఆయన్నే ముఖ్యమంత్రిని చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పి. అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పేరాపురంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని తెలియజేసే డిస్‌ప్లే బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎన్. సత్యనారాయణరాజు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు రౌతు శ్రీరామ్మూర్తి, కోరాడ మహేష్, గ్రంది సన్యాసిరావు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జొన్నవలసలో...

విజయనగరం రూరల్: రాష్ట్రంలో పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో అవసరమని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని జొన్నవలసలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న ప్రజలకు నాలుగున్నరేళ్లలో మంజూరైన సంక్షేమ పథకాలు, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేస్తూ రూపొందించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూనే నాడు- నేడు, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి బృహత్తర కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నడిపేన శశిభార్గవి, జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ డి.తిరుపతినాయుడు, పార్టీ నాయకులు కంది గణపతి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



బైరెడ్డిపాలెంలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని బైరెడ్డిపాలెంలో గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ బైరెడ్డి రాజు, బైరెడ్డి ఎర్రప్పలనారాయణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం నాలుగున్నరేళ్ల కాలంలో ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ పాలనలో ఎంత లబ్ధి చేకూరిందో... వైఎస్సార్‌సీపీ పాలనలో ఎంత లబ్ధి చేకూరిందో ప్రజలు గమనించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి పైసా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఖర్చు చేశారని తెలిపారు. మన రాష్ట్రంలో ప్రవేశపెడుతున్న పథకాల పట్ల ఇతర రాష్ట్రాల నాయకులు సైతం ఆకర్షితులవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో పడాల భానుప్రకాష్, సుందర హరీష్, కొల్లు రామ్మూర్తి, దల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు కొయ్య రాజుకమల, తహసీల్దార్ చింతా బంగార్రాజు, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

మంచి చేస్తున్న ప్రభుత్వానికే మా మద్దతు..

నెల్లిమర్ల రూరల్: గతంలో ఏ ప్రభుత్వంలోనూ సంక్షేమ పథకాల వల్ల లబ్ధి పొందలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ప్రభుత్వ పథకాలన్నీ అందుతున్నాయని కొండగుంపాం ప్రజలు స్పష్టం చేశారు. మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే రానున్న ఎన్నికల్లో మా మద్దతు ఉంటుందని తేల్చి చెప్పారు. మండలంలోని కొండగుంపాం సచివాలయ పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, తదితరులు అధికారులతో కలిసి ముందుగా సచివాలయం వద్ద సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి మళ్లీ రాష్ట్రానికి జగన్ మోహన్‌రెడ్డి ఎందుకు అవసరమో వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, సర్పంచ్ పతివాడ అప్పన్న పాల్గొన్నారు.



నెల్లిమర్ల రూరల్: కొండగుంపాంలో ఇంటింటా ప్రజాభిప్రాయ సేకరణలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, తదితరులు

గొల్లలపేటలో ..

విజయనగరం రూరల్: మండలంలోని గొల్లలపేటలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాలుగున్నరేళ్లలో లబ్ధి పొందిన సంక్షేమ పథకాల వివరాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, పార్టీ నాయకులు, మండల స్థాయి అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

- జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు సీతాలక్ష్మి, తదితరులు

పూసపాటిరేగ: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల హెచ్ఎం బి. శంకరరావు, సర్పంచ్ టి. సీతారాం, పి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కుమిలిలో...

మండలంలోని కుమిలి గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ రకాలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇందుమతి, ఎ జి. సురేష్‌రెడ్డి, గుజ్జు తిరుమలరెడ్డి, గాబు సూరప్పన్నరెడ్డి, పడాల శ్రీధర్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

నెల్లిమర్ల: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక శాఖా గ్రంథాలయంలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. నగరం పంచాయతీ చైర్‌పర్సన్ సరోజిని బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందించారు.

ఆర్థిక సాయం



బాధితుల కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: ఎల్.కోట మండల కేంద్రంలో ఆదివారం జరిగిన గ్యాస్ సిలిండర్ పేలుడు సంఘటనలో తీవ్ర గాయాల పాలైన కెల్ల శ్రావణి కుటుంబానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు రూ. 50 వేల ఆర్థికసాయం అందజేశారు. ఎల్.కోట గ్రామానికి చెందిన కెల్ల శ్రావణి నివాసంలో గ్యాస్ సిలిండర్ లీకై పేలుడు సంభవించి ఐదుగురు తీవ్రంగా గాయపడి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సోమవారం ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. అనంతరం జెడ్పీ నిధుల నుంచి రూ. 50 వేల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.